## చెరువును తలపించిన హనుమాన్ ఆలయ ప్రాంగణం



కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ ముఖద్వార ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

చంపాపేట, జూన్ 12: వర్షపు నీటితో కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ ముఖ ద్వార ప్రాంగణం చెరువును తలపించింది. శుక్రవారం ఉదయం కురిసిన వర్షం కారణంగా చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయ ముఖద్వార ప్రాంగణం పూర్తిగా నీట మునిగి చెరువును తలపించింది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన ఆలయం ఈ విధంగా మారడంతో భక్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కానీ, వర్షం కురిసినప్పుడు ఇక్కడ తరచూ ఈ సమస్య పై ఎవరు దృష్టి సారించి, శాశ్వత పరిష్కారాన్ని చూపకపోవడం దుర్మార్గమని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా స్వామివారి కృపకు పాత్రులయ్యే భక్తులు ఎందరో అనేక రూపాల్లో స్వామి వారి పేరు మీద హుండీలో లక్షలాది రూపాయల దక్షిణలు సమర్పించుకుంటారు. ఈ సొమ్మంతా ఎక్కడికి వెళ్తుందో ఏమో తెలియదు కానీ ఆలయ అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమే. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆలయ ప్రాంగణం లో నెలకొన్న ఇన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ బాధ్యులకు కనువిప్పు కలిగి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న శ్రీనివాస శర్మ

కందుకూరు, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించనున్నట్లు మండల పరిధిలోని నేదునూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస శర్మ తెలిపారు. విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందిస్తున్నట్లు తెలిపారు, తల్లిదండ్రులు ప్రైవేట్, కార్పొరేట్ మోజులో పడి, ప్రభుత్వ పాఠశాలని చిన్న చూపు చూడొద్దన్నారు. నేదునూరు పాఠశాలలో 6 నుండి 10తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం ఉందని, పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రాణి, విద్యార్థుల తల్లి దండ్రులు మల్లేష్, సత్యమ్మ, ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు. విజయ్ మోహనరెడ్డి, సురేష్, గ్లోరీ, శాంతికుమారి, కౌసల్య, శ్రీవాణి, గిరిజ, అబ్దుల్లా. బషీర్, సర్వర్, హసనుద్దీన్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.



సాహెబ్ నగర్ ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న కార్పొరేటర్ అరుణా రవీందర్ రెడ్డి, సైదాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, తదితరులు

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలవాలి

**- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి**
**- ప్రారంభమైన పాఠశాలలు**

వనస్థలిపురం, జూన్ 12 : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సాహెబ్ నగర్ ప్రభుత్వ స్కూల్లో గురువారం నిర్వహించిన 'బడి బాట' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో గొప్ప వారంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదివారన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు.

### టీం పార్కును పరిశీలించిన ఎమ్మెల్యే

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ 8వీ రోడ్‌లో నిర్మిస్తున్న ఉమెన్స్ టీం పార్క్‌ను ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాన్ని పూర్తి చేయాలని, త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

### విద్యార్థులు చదువుల్లో రాణించాలి

సైదాబాద్, జూన్ 12: విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తును ఉజ్వలంగా తయారుచేసుకొని, సమాజానికి, దేశానికి, ధర్మానికి ఉపయోగపడాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి అన్నారు. గురువారం విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా సైదాబాద్ ఆర్య సమాజ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

### స్వల్పంగా హాజరైన విద్యార్థులు

సైదాబాద్, జూన్ 12: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఈ నూతన విద్యా సంవత్సరానికి తరగతులు పునర్ ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉపాధ్యాయులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు ప్లకార్డులు పట్టుకొని చిన్నారులకు స్వాగతం పలుకుతూ పువ్వులు, చాక్లెట్లు అందజేశారు. మొదటిరోజు కావడంతో విద్యార్థులు స్వల్పంగా వచ్చారని, పూర్తిస్థాయిలో హాజరు కాలేదని, సోమవారం నుంచి పూర్తిస్థాయిలో విద్యార్థులంతా తరగతలకు హాజరు కానున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని శ్రీసాయి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పద్మిని, ఆయా సక్కుబాయి చిన్నారులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శిస్తూ అంగన్‌వాడీ పాఠశాలకు విద్యార్థులు పంపించాలని తల్లిదండ్రులను కోరుతూ స్థానికంగా ర్యాలీ నిర్వహించారు. రెండు సంవత్సరాల వయసు కలిగిన చిన్నారుల నుంచి ఐదు సంవత్సరాల వరకు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అడ్మిషన్లు ప్రారంభించామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఆమె తల్లిదండ్రులకు సూచించారు.

### 'ప్రైవేటు' మోజులో పడి డబ్బులు వృథా చేసుకోకండి

మన్సూరాబాద్, జూన్ 12: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధనలు జరుగుతున్నాయని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల మోజులో పడి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు సరిత, స్వరాజ్యం, అంగన్‌వాడీ టీచర్ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

### కందుకూరులో..

కందుకూరు, జూన్ 12 : నిన్న, మొన్నటి వరకు ఇంటి వద్ద ఆటా పాటలతో గడిపిన విద్యార్థులు గురువారం 'బడిబాట' పట్టారు. ప్రభుత్వం పాఠశాలను ప్రారంభించాలని ఆదేశించడంతో 48 రోజులపాటు వేసవి సెలవులను పూర్తిచేసుకుని విద్యార్థులు పాఠశాలకు రావడంతో స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు వారికి కావలసిన పుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. విద్యార్థులు పాఠశాలలకు రావడంతో సందడిగా మారింది.



సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

## రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తీగల అజిత్ రెడ్డి

మలక్ పేట, జూన్ 12: బీఆర్ఎస్ నాయకుడు, మీర్ పేట మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆజం అలీ పరామర్శించారు. సలీంనగర్‌లోని రంజిత్ రెడ్డి నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచిన మృతదేహానికి వారు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామమైన మీర్‌పేటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

## తడి- పొడి చెత్త పై విద్యార్థులకు అవగాహన




జిల్లెల్లగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తడి, పొడి చెత్తపై విద్యార్థులచే ప్రమాణం చేయిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్, ఎంఈఓ కృష్ణయ్య, తదితరులు

బడంగ్ పేట్, జూన్ 12: మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెల్లగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తడి, పొడి చెత్తపై కమిషనర్ ఆర్. జ్ఞానేశ్వర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ కృష్ణయ్య, ఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులచే ప్రమాణం చేయించారు. రోడ్లపై చెత్త వేయకుండా, తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త ఆటోలో వేసే విధంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

చెత్త రోడ్ల మీద వేయడం ద్వారా కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు తగు సూచనలు చేశారు.

### తుక్కుగూడలో..

తుక్కుగూడ మున్సిపాలిటీలో వందరోజుల ప్రణాళికలో భాగంగా రోడ్లపై చెత్త వేస్తున్న వారికి కమిషనర్ వాణి రెడ్డి ఆదేశాల మేరకు 11 వేల జరిమానా విధించారు. చెత్తను రోడ్లపైన వేయడం ద్వారా పారిశుధ్యం లోపించి ప్రజలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని కమిషనర్ అన్నారు. అందులో భాగంగానే రోడ్లపై చెత్త వేసిన వాళ్లకు జరిమానా వేస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులు, నాయకులు మున్సిపాలిటీకి సహకరించాలన్నారు.



తుక్కుగూడలో రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా వేస్తున్న మున్సిపల్ అధికారులు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 12 : విద్యుత్ మరమ్మతుల కారణంగా లక్ష్మీ నగర్ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ వినయ్ నగర్ కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చంపాపేట ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వినయ్ నగర్ కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 2: 30 గంటల నుండి సాయంత్రం 5: 30 గంటల వరకు వినయ్ నగర్, కృష్ణా నగర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్, శ్రీనివాస్‌నగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ఆస్మాన్ ఘడ్ డివిజన్ పరిధిలో...

11కేవీ సింగరేణి కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,11కేవీ సరస్వతి నగర్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు ఆయా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్ ఘడ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### ఆర్కేపురం పరిధిలో..

ఆర్కేపురం, జూన్ 12: చిత్రాలేఅవుట్, రాక్ హిల్స్, లెక్చరర్ కాలనీ, పుష్ప గార్డెన్, గణేష్ నగర్, వీరభద్ర నగర్, విద్యుత్ నగర్, కిల్లా మైసమ్మ, జైపూర్ కాలనీ, స్టేడియం, హుడా సాయి నగర్, చాణిక్యపురి కాలనీ, డెంటల్ కళాశాల, వాసవీ కాలనీ, భవ్య హాస్పిటల్, లక్ష్మీ గణపతి, జేబీ కాలనీ 11 కేవీ ఫీడమ్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఈ దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ తెలిపారు. చిత్రలే అవుట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీతారామపురం, సరస్వతినగర్, ఆనంద్ నగర్, అంబేద్కర్ నగర్ పరిసర ప్రాంతాలు. రాక్ హిల్స్ ఫీడర్ పరిధిలో రాక్ హిల్స్, రాక్ టౌన్, విశాలాంధ్ర పరిసర ప్రాంతాలు. లెక్చరర్ కాలనీ ఫీడర్ పరిధిలో లెక్చరర్ కాలనీ, వినాయక నగర్, ఓల్డ్ హయత్ నగర్, ఎల్ఐసీ కాలనీ పరిసర ప్రాంతాలు. పుష్ప గార్డెన్ ఫీడర్ పరిధిలో పీవీటీ మార్కెట్, డీసీబీ బ్యాంక్, అన్నపూర్ణ కల్యాణ మండపం, సిరి నగర్ కాలనీ, హుడా కాలనీ, శ్రీనివాస నగర్, కృష్ణవేణి నగర్, పుష్ప గార్డెన్ మెయిన్ రోడ్, జోనల్ కమిషనర్ కార్యాలయం పరిసర ప్రాంతాలు. గణేష్ నగర్ ఫీడర్ పరిధిలో గణేష్ నగర్, కుంట్లూరు, నారాయణ కళాశాల, శివ శంకర్ కాలనీ, రత్న కాలనీ, ఇష్టకామేశ్వరి దేవాలయం పరిసర ప్రాంతాలు. వీరభద్ర నగర్ ఫీడర్ పరిధిలో శుభోదయం కాలనీ, సూర్య నగర్, సుబ్రహ్మణ్య నగర్, పుకట్ నగర్, వీరభద్ర నగర పరిసర ప్రాంతాలు. విద్యుత్ నగర్ ఫీడర్ పరిధిలో లక్ష్మీ నగర్ కాలనీ, ఎస్బీఐ కాలనీ, ఓంని హాస్పిటల్, కొత్తపేట ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలు. కిల్ల మైసమ్మ ఫీడర్ పరిధిలో ఎన్టీఆర్ నగర్, గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్ నెంబర్ 4 పరిసర ప్రాంతాలు. జైపూర్ కాలనీ ఫీడర్ పరిధిలో అంబేద్కర్ నగర్, ఖుషి నగర్, ఫత్తుల గూడా, జైపూర్ కాలనీ, లక్ష్మీనరసింహపురి కాలనీ పరిసర ప్రాంతాలు. స్టేడియం ఫీడర్ పరిధిలో ఎస్బీహెచ్ వెంచర్_1, ప్రగతి నగర్, ఎల్బీనగర్ టెంపుల్ కాంప్లెక్స్, డీ మార్ట్ లైన్, దానాపురం పరిసర ప్రాంతాలు. హుడా సాయి నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జడ్జెస్ కాలనీ, విజయశ్రీ కాలనీ, వివేకానంద నగర్, శారద ఎస్టేట్ పరిసర ప్రాంతాలు. చాణిక్యపురి ఫీడర్ పరిధిలో బండ్లగూడ, ఆనంద్ నగర్ ప్రధాన రహదారి పరిసర ప్రాంతాలు. డెంటల్ కళాశాల ఫీడర్ పరిధిలో హుడా కాలనీ ప్రధాన రహదారి, మోర్ వెనుక ప్రాంతం, డీసీబీ బ్యాంక్, డెంటల్ కళాశాల పరిసర ప్రాంతాలు. వాసవీ కాలనీ ఫీడర్ పరిధిలో వాసవీ కాలనీ, ఆర్కే పురం, హరిపురి కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్ నెంబర్ వన్ పరిసర ప్రాంతాలు. భవ్య హాస్పిటల్ ఫీడర్ పరిధిలో బాలాజీ నగర్, మోహన్ నగర్, సమతాపురి, సమతాపురి ఓల్డ్, శృంగేరి కాలనీ, స్నేహపురి కాలనీ పరిసర ప్రాంతాలు. లక్ష్మీ గణపతి ఫీడర్ పరిధిలో జే కన్వెన్షన్ హాల్, లక్ష్మీ గణపతి కాలనీ పరిసర ప్రాంతాలు. జేవీ కాలనీ ఫీడర్ పరిధిలో జేబీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, క్రాంతి నగర్, సాయి కృష్ణా నగర్ పరిసర ప్రాంతాలు.

## మున్సిపల్ సిబ్బందికి హెల్త్ కార్డులు అందజేత




సిబ్బందికి హెల్త్ కార్డులు అందజేస్తున్న సీడీఎంఏ సంధ్య. చిత్రంలో కమిషనర్ సరస్వతి, తదితరులు

బడంగ్ పేట్, జూన్ 12: వ్యర్థాలను సేకరించే వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే స్కీములను సద్వినియోగం చేసుకోవాలని సీబీఎంఏ బి. సంధ్య అన్నారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వందరోజుల ప్రణాళికలో భాగంగా కమిషనర్ సరస్వతి ఆధ్వర్యంలో నవజీవన్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'నమస్తే స్కీం' కార్యక్రమానికి సంధ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ సిబ్బందితో ఆమె మాట్లాడారు. సిబ్బందికి హెల్త్ కార్డులను అందజేశారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భద్రత నైపుణ్యాలను, సామాజిక రక్షణకు, పాప్యత మౌలిక సదుపాయాలకు, పాప్యత ఆర్థిక సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డు, హెల్త్ కార్డులను ఆమె అందజేశారు. ఈ కార్డులు ఐదు లక్షల వరకు ఉపయోగపడుతుందన్నారుఈ కార్యక్రమంలో ఏఎంసీ శ్యాంసుందర్, డీఈ వెంకన్న, మేనేజర్ నాగేశ్వరరావు, ఆర్వో వేణుగోపాల్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, జూన్ 12: పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగాను ఉపయోగ పడుతుందని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. పాతబస్తీ ఫంజేషా లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు 40 లక్షల 78 వేల ఐదు వందల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఆర్థికంగా వెనుకబడిన, సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధి పొందడానికి అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. నియోజకవర్గ పరిధిలోని సైదాబాద్, చార్మినార్, అంబర్ పేట మండలాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్, అంబర్ పేట, చార్మినార్ మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## 15న సుదర్శన నరసింహ హోమం

మన్సూరాబాద్, జూన్ 12: శ్రీ వైష్ణవ సంఘం తెలంగాణ రాష్ట్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని మన్సూరాబాద్ డివిజన్ పరిధి చంద్రపురి కాలనీలోని శ్రీ వైష్ణ వసదనంలో ఘనంగా నిర్వహించారు. సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్టీ చారి, ఎస్వీఎస్ ట్రస్ట్ చైర్మన్ కండ్లకుంట యాదగిరాచార్యుల సమక్షంలో ప్రమాణస్వీకారాన్ని నిర్వహించి తదుపరి కార్యాచరణను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఏవీఎల్ఎన్ చారి మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు, విశ్వశాంతి పరిరక్షణ కోసం దేవనాథ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ నెల 15న సుదర్శన నరసింహ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిదండి రామానుజ చిన జీయర్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచార్యులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారితో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని శ్రీ వైష్ణవ సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి



బాచుపల్లి గ్రామ నూతన ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

కందుకూరు, జూన్ 12 : ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రావుగాళ్ళ బాబు మాదిగ తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7న దండోరా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు వేయడం, జెండా దిమ్మెలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గురువారం మండల పరిధిలోని బాచుపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గం ఎన్నుకున్న అనంతర ఆయన మాట్లాడుతూ, మాదిగల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ గ్రామాన పర్యటించి కార్యవర్గలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ నూతన అధ్యక్షుడిగా వెంకటయ్యను ఎన్నుకున్నారు. అనంతరం పూర్తి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండలం అధ్యక్షులు మల్లెపల్లి కృష్ణ మాదిగ, కార్యకర్తలు, కుల పెద్దలు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అపార్ట్మెంట్ వాసులపై

# బిల్డర్, అనుచరుల దాడి



దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బ్రహ్మానందం

మలక్ పేట, జూన్ 12: కోర్టు తీర్పును ధిక్కరిస్తూ, జీహెచ్ఎంసీ అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ అపార్ట్మెంట్ లో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అపార్ట్మెంట్ వాసులను బిల్డర్, అతని అనుచరులు చితకబాదిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆస్మాన్ ఘడ్‌లోని ఎలైట్ హిల్స్ రెసిడెన్సీలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మూడేళ్ల క్రితం మసీయుద్దీన్ అనే బిల్డర్ ఆస్మాన్ ఘడ్‌లోని రాక్ చర్చి వద్ద అపార్ట్ మెంట్‌ను నిర్మించి ఫ్లాట్లను అమ్మేశాడు. కాగా ఇటీవల బిల్డర్ మసీయుద్దీన్ అపార్ట్మెంట్ కామన్ ఏరియాలో జీహెచ్ఎంసీ నిబంధనలు, ప్లాన్‌కు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపట్టాడు. దాంతో అపార్ట్మెంట్ వాసులు కోర్టును ఆశ్రయించగా, అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని తీర్పునిచ్చింది. విషయం తెలుసుకున్న బిల్డర్ గురువారం సాయంత్రం మూడు గంటలకు అతని అనుచరులు కలీం ఖాన్, అసద్ మరో ముగ్గురు వ్యక్తులను పంపించి నిర్మాణ పనులను కొనసాగించాలని పంపించగా, అపార్ట్మెంట్ వాసులు బ్రహ్మానందం, మరికొందరు అడ్డుకున్నారు. దాంతో జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించగా, వారు కూడా వచ్చి నిర్మాణం చేపట్టరాదని ఆదేశించగా, వారితో వాగ్వివాదానికి దిగి బిల్డర్, అతని అనుచరులు నిర్మాణ పనులను నిలిపివేయలేదు. బ్రహ్మానందం కోర్టు తీర్పును గౌరవించాలని, అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని అభ్యంతరం వ్యక్తం చేయడంతో బిల్డర్, అతని అనుచరులు అపార్ట్మెంట్‌లోకి చొరబడి బ్రహ్మానందంపై కాళ్లు, చేతులతో చితకబాదుతూ, కింద పడేసి ప్రైవేట్ పార్ట్‌పై దాడి చేస్తుండటంతో అపార్ట్మెంట్ నివాసులైన మహిళలు అతన్ని కాపాడేందుకు ప్రయత్నం చేయగా, వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ వారిపై కూడా దాడి చేశారు. దీంతో బ్రహ్మానందంకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంతలో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో దాడికి పాల్పడిన వ్యక్తులు అక్కడి నుంచి ఫరార్ అయ్యేందుకు యత్నించగా, అందులో ఒక వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. జరిగిన సంఘటనపై బాధితులు మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, దాడికి పాల్పడిన బిల్డర్ మసీయుద్దీన్, అతడి అనుచరులపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న నరసింహారెడ్డి

కందుకూరు, జూన్ 12 : బీజేపీ మండల యువమోర్చా అధ్యక్షుడు బుడ్డోళ్ల దేవేందర్ గౌడ్ ఈ నెల నాలుగో తేదీన ఆకస్మికంగా మృతి చెందిన విషయం విదితమే. దశదినకర్మను గురువారం స్వగ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ ఆనేగౌని అశోక్ గౌడ్ హాజరై మాట్లాడుతూ, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలం అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయన కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేశారు . ఆర్థిక సాయాన్ని నరసింహారెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవేందర్ గౌడ్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఆయన పిల్లల విద్యాభ్యాసానికి కావలసిన సదుపాయాలను కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. కుటుంబాన్ని ఆదుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తీరటి లక్ష్మణ్ ముదిరాజ్, జిట్టా రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురుసాని ఎల్లారెడ్డి, నల్లబోలు నరసింహారెడ్డి, పండల శ్రీనివాస్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ షెడ్లు తొలగించాలి

బడంగ్ పేట్, జూన్ 12: గుర్రంగూడ లో ఎలాంటి అనుమతి లేకుండ షెడ్ల నిర్మాణం చేస్తున్నా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని మాజీ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి ఆరోపించారు. అక్రమ షెడ్లను తొలగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమంగా షెడ్లు వేస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. షెడ్డుకు అనుమతి లేకపోగా సెట్ బ్యాక్‌లు కూడా వదలడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాలనీవాసులు ఇప్పటికే 10 మార్లు ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు. కాలనీవాసులు ఫిర్యాదు చేసినా, కార్పొరేటర్ ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు

### ఘనంగా చండీ హోమం

మలక్ పేట, జూన్ 12: పౌర్ణమిని పురస్కరించుకొని సలీంనగర్‌లోని గణపతి దేవాలయంలో చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు ముళ్లపూడి శ్రీనివాసరావు దంపతులు నిర్వహించిన ఈ చండీ హోమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతినెల పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీ హోమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. హోమానంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ గావించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

### 'మన ఆలోచన సాధన సమితి'
**రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బ్రహ్మయ్య**



మన్సూరాబాద్, జూన్ 12: 'మన ఆలోచన సాధన సమితి' రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎల్బీనగర్‌కు చెందిన పెద్దవూర బ్రహ్మయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగోల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ కులస్తులందరినీ ఒకే వేదికపై తీసుకువచ్చి, వారి హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా నియామకానికి సహకరించిన సాధన సమితి ప్రతినిధులు కటకం నర్సింగ్ రావు, నరసింహగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.